గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలతో..

ప్రారంభ సంచిక

అటవీశాఖ సమాచార పత్రిక

వన సంరక్షణి

జనవరి 2018

సంపుటి : 1 సంచిక : 1

చీఫ్ ఎడిటర్

జె.ఎస్.ఎన్.మూర్తి, IFS

ముఖ్య అటవీ సంరక్షణాధికారి మరియు సంచాలకులు : ఎ.పి. స్టేట్ ఫారెస్ట్ అకాడమీ

ఎడిటోరియల్ విభాగం

డా॥ నందని సలారియా, IFS

డివిజనల్ అటవీ శాఖాధికారిణి, కాకినాడ

దీక్షితుల ఆర్.వి. సుబ్రహ్మణ్యం

పి.ఆర్.ఓ

వన దరహాసం...

జనజీవన వికాసం



జలసంపదే జాతి సంపద, వన సంరక్షణే జన సంరక్షణ. అందుకే మొదటినుంచీ ఈ రెండిటికీ అధిక ప్రాధాన్యత ఇస్తూ వచ్చాను. జలవనరులతో సమానంగా అటవీ వనరులను కాపాడేందుకు దోహదపడే కార్యక్రమాలను మనం చేపట్టాం. ప్రకృతి అంటే ప్రాణప్రదాత. దేవుడు మరెక్కడా ఉండడు.. ప్రకృతి సంపదలోనే మమేకమై ఉంటాడు. అందుకే అటవీప్రాంత విస్తరణకు, అడవుల సంరక్షణకు అలాగే అటవీసంపదతో ముడిపడి ఉన్న గిరిజనాభ్యుదయానికి తద్వారా రాష్ట్ర సమగ్ర పురోభివృద్ధికి ఈ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 26 శాతం గ్రీన్ కవర్‌ను 2029 నాటికల్లా 50 శాతానికి పెంచాలనే దృఢదీక్షతో మనం కృషి చేస్తున్నాం. అదే మిషన్ హరితాంధ్రప్రదేశ్ లక్ష్యం. ఈ బృహత్ కార్యక్రమం ప్రభుత్వం ద్వారా మాత్రమే సాధ్యం కాదు. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రజలు చేతులు కలిపి ముందుకు పోవలసిన అవసరం ఉంది. ఇందుకు అటవీశాఖ యంత్రాంగాన్ని, వనసంరక్షణ సమితులను చైతన్యపరచి కార్యోన్ముఖులను చేసే స్ఫూర్తిని ఈ వార్తాలేఖ అందించాలని నా సూచన. నిర్దేశించుకున్న లక్ష్యాలు, వాటి సాధనకు సాగుతున్న కార్యాచరణ, సాధించిన పురోగతిని అవగతం చేసే క్రమంలో ఇటువంటి వార్తాలేఖలు ప్రభుత్వశాఖలకు స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. ఇటువంటి మాధ్యమాలనే కాకుండా సోషల్‌మీడియాను కూడా సమర్థంగా వినియోగించుకొని ప్రతిఒక్కరిలో వనచైతన్యం పాదుకొల్పడానికి మీరంతా కృషిచేయాలని నా అభిలాష. ఉద్యమస్ఫూర్తితో పనిచేద్దాం... రాష్ట్రాన్ని నందనవనంగా మారుద్దాం. జై జన్మభూమి.. జైహింద్ – **నారా చంద్రబాబునాయుడు, ముఖ్యమంత్రి**

అనంత ప్రయోజనాల అవని



ఒక మామూలు చెట్టు 50 సంవత్సరాల పాటు జీవించిందని అనుకుంటే... ఆ జీవిత కాలంలో అది సమాజానికి కనీసం 15 లక్షల 70 వేల రూపాయల విలువగల సేవలను అందజేస్తుందని 'ఎన్ ఇంట్రడక్షన్ టు బయోడైవర్సిటీ' (రచన : ప్రీతిపాల్ సింగ్) పుస్తకంలో చెప్పిన విషయం. ఇటువంటి లక్షల కోట్ల చెట్లు కలిగి ఉన్నదే అడవి. మరి అటువంటి అడవి ఒక సమాజానికి ఎన్ని వేల ఏళ్ళ పాటు సేవ చేస్తుంది... ఆ సేవకు ఎన్ని లక్షల కోట్లు వెల కట్టవచ్చనేది మన మేధస్సుకు అందని విషయం. అడవులు అనేక రకాలైన వృక్షాలకు, పలు జాతుల జంతువులకు నెలవు. అడవి అంటేనే చెట్లు, మృగాలు, జలపాతాలు గుర్తొస్తాయి. రమ్యమైన ప్రకృతి సౌందర్యం స్ఫురిస్తుంది. అడవులు మనకు అందజేసే ప్రయోజనాలు కోకొల్లలు. నిజానికి అడవులు ప్రాణాధారాలు. ఎందుకంటే వర్షపాతం అడవుల విస్తీర్ణంపైనే ఆధార పడి ఉంటుంది. ప్రకృతిసిద్ధమైన ఆహారానికి, ముడివనరులకు ఆలవాలం. స్వచ్ఛమైన నీటికి, ఔషధాలకు నిలయం. అన్నిటికంటే ప్రధానంగా అడవులు పర్యావరణ సమతుల్యతను కాపాడతాయి. జీవ వైవిధ్యాన్ని రక్షిస్తాయి.

సమాచార వారధి... చైతన్య సారథి

గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు మార్గనిర్దేశనంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ హరితాంధ్రప్రదేశ్ లో భాగంగా 2016 జూలై 29న "వనం-మనం" ప్రారంభమైంది. "వనం-మనం" వేదికగా "ప్రకృతి పిలుస్తోంది" అనే ప్రచార కార్యక్రమం చేపట్టి ప్రజలను చైతన్యపరచే వివిధ కార్యక్రమాలను అటవీశాఖ నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా వాడవాడలా వన మహోత్సవాలు నిర్వహించి మొక్కలు నాటడమే కాకుండా నగర వనాల రూపకల్పన, అటవీ ప్రాంతాల సంరక్షణకు దోహదపడే వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తీరు ప్రశంసనీయం. ఖాళీగా ఉన్న ప్రభుత్వ అటవీ, దేవాదాయ భూములు, సామాజిక, గిరిజన సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల్లో, రైల్వే స్థలాలు, హౌసింగ్ కాలనీలలో... ఇలా అన్నిచోట్లా మొక్కలు నాటి గ్రీన్‌కవర్ వ్యాప్తికి దోహదం చేయాలి. అటవీ ప్రాంత శివారు గ్రామాల్లో వివిఎస్ఎస్ మరియు సహాయక సభ్యులు మొక్కలు నాటడం. గ్రీన్ రన్, సైకిల్ ర్యాలీలు, పర్యావరణ పాదయాత్రలను చేపట్టడం, పర్యావరణం, అటవీ పరిరక్షణపై విద్యార్థులను చైతన్యపర్చడం ఉద్యమస్థాయిలో జరగాలి. వనం-మనం కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ.. లక్ష్యం దిశగా మన ప్రభుత్వం ఉత్తమ ఫలితాలను కనబరుస్తున్నది. నాటిన ప్రతి మొక్కనూ జియో ట్యాగింగ్ చేయడం, జియో ఫెన్సింగ్ వంటి ప్రక్రియలు అవలంబించడం ద్వారా జవాబుదారీ తనాన్ని అన్నిస్థాయిల్లో పెంపొందించడం జరిగింది. ప్రతి మొక్కా చెట్టుగా ఎదిగి సమాజ కళ్యాణానికి దోహదపడాలన్న ప్రభుత్వ ధ్యేయానికి, నిర్విరామంగా లక్ష్య సాధనకు శ్రమిస్తున్న అటవీ యంత్రాంగానికి వారధిగా, అలాగే ప్రజాచైతన్యసారథిగా ఈ న్యూస్‌లెటర్ ఉండాలని ఆకాంక్షిస్తూ...

– **శిద్ధా రాఘవరావు,**
అటవీశాఖా మాత్యులు

వివిధ అడవులు.. జీవ, పర్యావరణ వైవిధ్యాలు

కోనిఫెరస్ అడవులు : ఇవి శీతల ప్రాంతాలలో పెరుగుతాయి. ఎక్కువ వర్షపాతం ఉండాలి. పటిష్టమైన ఋతు శీతోష్ణస్థితులు, చాలాకాలం కొనసాగే అతి శీతాకాలం, కొద్దికాలం మాత్రమే ఉండే వేసవికాలం ఈ అడవులకు అనుకూలం. ఇవి కొన్ని ఖండాలను కలుపుతూ వరుసగా పెరుగుతాయి. ఉత్తర అమెరికా, యూరేసియా, కెనడా, స్వీడన్, ఫిన్లాండ్, సైబీరియా దేశాల్లో ఇవి వ్యాపించి ఉన్నాయి. సతతహరిత వృక్ష జాతులైన పైన్, స్ప్రూస్, ఫర్ మొదలైన జాతులు ఇక్కడ పెరుగుతాయి. చెవుల పిల్లులు, తోడేళ్ళు, ఎలుగుబంట్లు, ముళ్ళపందులు, ఉడతలు, హైలా, రానా వంటి అనేక జాతుల పక్షులు, పెద్ద శరీరంతో ఉండే సకశేరుకాలు కనిపిస్తాయి. ఇక్కడ మట్టి పలుచగా ఉంటుంది. సారవంతంగా ఉండదు. కోనిఫెర్‌ల గింజలు జంతువులకు ఆహారంగా ఉపయోగపడతాయి.

ఆకురాల్చే సమశీతోష్ణ అడవులు : ఇవి శీతోష్ణస్థితి సమంగా ఉండే ప్రాంతాలలో ఉంటాయి. ఇక్కడ చెట్లు వెడల్పు ఆకులతో ఉంటాయి. వర్షాకాలంలో ఆకులు రాల్చి, చలికాలంలో ఆకులు లేకుండా ఉండి. వసంతకాలంలో తిరిగి చిగుర్చుతాయి.

ఇవి ఉత్తర అమెరికా, ఐరోపా, తూర్పు ఆసియా, చిలీ, ఆస్ట్రేలియా, జపాన్ మొదలైన దేశాలలో ఉన్నాయి. అతి శీతలంగా ఉండే చలికాలం, సంవత్సరానికి 80-180 సెం.మీ. వర్షపాతం, 10-20 డిగ్రీల వేడిమి ఈ అడవుల్లో కనిపించే వాతావరణం. చెట్లు 40-50 మీటర్ల ఎత్తు పెరుగుతాయి. ఓక్, బీచ్, కాడన్ ఉడ్, ఎల్మ్ వంటి పెద్ద వృక్షాలు ఈ అడవుల్లో ఉంటాయి. నాచులు, శైవలాలు, లైకేన్లు వృక్ష కాండాలమీద పెరుగుతాయి. జింకలు, ఎలుగుబంట్లు, ఉడతలు, సక్కలు, వడ్రంగి పిట్టలు, తాబేళ్లు, బల్లులు, పాములు ఇక్కడ ఎక్కువగా కనిపిస్తాయి.

సతతహరిత సమశీతోష్ణ అడవులు : ఇవి మధ్యధరా ప్రాంతానికి చెందిన శీతోష్ణ పరిస్థితులలో పెరుగుతాయి. పొడిగా ఉండే ఎండాకాలం, అతిచల్లని శీతాకాలం ఈ అడవులలో కనిపించే లక్షణం. ఈ వృక్షాలకు చిన్నగా సూది ఆకారంలో ఉండే ఆకులు గానీ, కొద్ది వెడల్పయిన ఆకులు గానీ ఉంటాయి. దీనిలో మహావృక్షాలు ఉండవు. చెట్లు 3.8 మీ. ఎత్తు మాత్రం పెరుగుతాయి. ఈ అడవులు ఎక్కువగా కాలిపోతుంటాయి. అందువల్ల ఇక్కడి చెట్లు త్వరగా పునరుత్పత్తి చేసుకోగలిగే లక్షణాలతో ఉంటాయి. కంచర గాడిదలు, జింకలు, కుందేళ్ళు, అడవి ఎలుకలు, బల్లులు ఇక్కడ ఉండే ముఖ్యమైన జంతువులు. వేగంగా పరుగెత్తే జంతువులు, దుమికే జంతువులు కానవస్తాయి.

వర్షాధార సమశీతోష్ణ అడవులు : ఇక్కడ ఉష్ణోగ్రత, వర్షపాతం సంవత్సరం పొడవునా మారుతూ ఉంటుంది. వర్షపాతం చాలా ఎక్కువగా ఉంటుంది. పొగమంచు బాగా దట్టంగా అలుముకొని ఉండి, వర్షం కంటే ఎక్కువగా నీటిని భూమికి అందిస్తుంది. ఇవి ఉత్తర అమెరికాలోని పసిఫిక్ తీరంలోను, ఆస్ట్రేలియా, టాస్మానియా లోను ఉన్నాయి. రెడ్ ఉడ్ వృక్షాలు, యూకలిప్టస్ చెట్లు ఇందులో బాగా పెరుగుతాయి.

వర్షాధార ఉష్ణ మండల అడవులు : ఇవి భూమధ్య రేఖకు దగ్గరగా ఉష్ణోగ్రత, తేమ రెండూ కూడా ఎక్కువగా స్థిరంగా ఉండే ప్రాంతాలలో ఉంటాయి. సంవత్సర వర్షపాతం 200-225 సెం.మీ. ఏడాది పొడవునా సమంగా ఉంటుంది. ఇవి మధ్య, దక్షిణ అమెరికా, పశ్చిమ ఆఫ్రికా, దక్షిణ ఆసియా, మలయా, బోర్నియా, న్యూగినీ, ఆస్ట్రేలియాలలో ఉన్నాయి. ఈ రకం అడవులలో వృక్ష జాతుల్లో వైవిధ్యం బాగా కనిపిస్తుంది. వృక్షాలు బాగా దగ్గర దగ్గరగా, చాలా ఎత్తు పెరిగి దట్టమైన అడవులుగా ఏర్పడతాయి. ఆకురాల్చే చెట్లు ఉన్నా అన్నీ ఏకకాలంలో ఆకులను రాల్చవు గనుక ఈ ఆడవులు సతతహరితంగా ఉంటాయి. ఆకులు మందంగా, ముదురు రంగులో ఉంటాయి. ఇక్కడ అకశేరుకాలు సమృద్ధిగా ఉంటాయి. పురుగులు, నత్తలు, శతపాదులు, సహస్రపాదులు, తేళ్ళు, సాలె పురుగులు, కీటకాలు జలగలు ప్రముఖంగా చెప్పుకోదగ్గవి. సకశేరుకాలలో వృక్షవాసులు, నిశాచరులు ఎక్కువ. భారతదేశంలో ఈ అడవులలో ఏనుగులు, పెద్ద పులులు, సాంబార్ జింక, మచ్చల జింక మొదలైన క్షీరదాలు ఉన్నాయి.

ఋతుబద్ధ ఉష్ణమండల అడవులు : వీటిలో వార్షిక వర్షపాతం చాలా ఎక్కువ. తేమతో కూడిసది గాను లేదా తేమ లేనిది గాను ఇవి విభజించబడి ఉంటాయి. ఇవి దక్షిణ, మధ్య అమెరికాలో తూర్పు దక్షిణ ఆసియాలో, పశ్చిమ ఆఫ్రికాలో, ఆస్ట్రేలియాలో, ఉష్ణమండల ద్వీపాలలో ఉంటాయి. వీనిలో వృక్షాలు 40 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతాయి. అతి ఎత్తులో ఆకురాల్చే వృక్షాలు, కొద్దిగా కిందుగా సతత హరిత వృక్షాలు ఉంటాయి. ఈ విధంగా ఇవి రెండు అంతస్తులుగా అమరి ఉంటాయి. ఇక్కడ టేకు, వెదురు చెట్లు బాగా పెరుగుతాయి.

విజయగాథల కదంబం.. లక్ష్యసిద్ధికి ప్రతిబింబం

భావి తరాలను ప్రభావితం చేసే కీలకమైన విధుల నిర్వహణలో అహరహం శ్రమిస్తున్న అటవీశాఖ సిబ్బందికి మొదటగా నా అభినందనలు. అడవి లేకపోతే అభివృద్ధి లేదు.. అసలు మానవజాతి ఉనికే ఉండదు. అటువంటి అడవికి సంరక్షకులు మీరు. ఈ గొప్ప బాధ్యత భుజస్కంధాలపై ఉన్నందుకు అనుక్షణం గర్వించాలి. మిషన్ హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా వన సంపద, వన సేవ, వన వికాసం, వన సురక్ష తదితర లక్ష్యాలను సాధించాల్సి ఉంది. అత్యంత దూరదృష్టితో మన ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం సఫలమై రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చాలంటే క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది, అధికారుల కృషి, అంకితభావం ఎంతో అవసరం. వన్యమృగాల వేట, అక్రమ రవాణా సంపూర్ణంగా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. అడవిని నాశనం చేసే ఏ విధమైన మానవ కార్యకలాపాలను అనుమతించరాదు. గిరిజనాభ్యుదయం అటవీప్రాంత అభివృద్ధిపై ఆధారపడి ఉంటే, అటవీ ప్రాంత సంరక్షణ పరిసర ప్రాంతాల ప్రజల చైతన్యంపై ఆధారపడి ఉంది. అందుకే అడవుల ప్రయోజనాలు, ప్రాముఖ్యతపై ప్రజలను జాగృతపరచాల్సిన కర్తవ్యం క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉంది. ప్రజల భాగస్వామ్యం, సహకారం లేకుండా వన సంరక్షణ కార్యక్రమాలు జయప్రదం కాబోవు. ఇదే విషయాన్ని 1988 నాటి జాతీయ అటవీ విధానం కూడా ప్రముఖంగా పేర్కొన్నది. అందుచేత దైనందిన విధి నిర్వహణలో ప్రజాసహకారం, భాగస్వామ్యం సాధించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలి. ఈ దిశగా ప్రతి ఒక్కరినీ జాగృత పరిచేందుకు, విధినిర్వహణ పరంగా మనలో ప్రతిఒక్కరూ సాధిస్తున్న విజయాలను అందరికీ తెలియపరిచేందుకు ఉద్దేశించినదే ఈ వార్తాలేఖ. అడవితల్లి ఒనగూర్చే ప్రయోజనాలను ప్రభావపంతంగా వివరించడంతో పాటు, అటవీశాఖ కృషిని, ఆ కృషితో మారుతున్న గిరిజన జీవన చిత్రాలను ఆవిష్కరించడం, వనసంరక్షణ సమితుల విజయగాథలను అందరికీ తెలియజేయడం, ఎకో టూరిజంను ప్రోత్సహించడం దీని ఉద్దేశం. సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా ఇది ఉండాలని, ఈ వార్తాలేఖలో మీ అనుభవాలను, భావాలను, రచనలను కూడా పంచుకొని మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దుకోవాలని నా అభిలాష.

– **పి.మల్లికార్జునరావు,** IFS
అటవీ దళాధిపతి, ఆంధ్రప్రదేశ్

సంపూర్ణ అవగాహన...

సమగ్ర శిక్షణ

క్షేత్రస్థాయి ఉద్యోగుల గురుకులం ఎపి ఫారెస్ట్ అకాడమీ

అటవీ శాఖలో క్షేత్రస్థాయి సిబ్బందిని విధి నిర్వహణకు పూర్తి స్థాయిలో సమాయత్తం చేసే అత్యుత్తమ స్థాయి శిక్షణా సదు పాయాలను కల్పి స్తున్న ఎపి ఫారెస్ట్ అకాడమీ అనతి కాలంలోనే అద్భుత ఫలితాల దిశగా పురోగమిస్తోంది. ఈ అకాడమీ రాజమహేంద్రవరం శివారు దివాన్‌చెరువు గ్రామంలో 2016లో ఏర్పాటైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రంగారెడ్డి జిల్లా దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ సిబ్బంది శిక్షణ సేవలను అందించేది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత దీనిని ఎపి పునర్విభజన చట్టంలో పదో షెడ్యూల్‌లో చేర్చారు. దాని ప్రకారం ఈ అకాడమీ సేవలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు రెండూ 2024 వరకూ ఉపయోగించుకోవచ్చు. అయితే అటవీ సెక్షన్ అధికారులు, బీట్ ఆఫీసర్ల శిక్షణకు ఉన్న ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాప్యం లేకుండా సొంత అకాడమీని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది. ఈమేరకు దివాన్ చెరువు గ్రామపరిధిలో అకాడమీ ఏర్పా టుపై ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (గుంటూరు) వారు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనిపై ప్రభుత్వం G.O.Ms.no 104, (E.F.S.& T (For-V) Dept., Dated:19-10-2016) ఉత్తర్వులు జారీ చేసింది. 2017 జనవరి 2 నుంచి తొలి బ్యాచ్ సెక్షన్ ఆఫీసర్స్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ శిక్షణ ఇక్కడ మొదలైంది. అటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల పనితీరును మెరుగుపర్చడం, అభ్యాసం ద్వారా సమర్థతకు సాన పట్టడం ఈ అకాడమీ ప్రధాన ఉద్దేశం. క్రమబద్ధమైన శిక్షణ ఇవ్వడం ద్వారా సిబ్బంది నైపుణ్యా లను పెంచడం, పరిణతిని అలవర్చడం లక్ష్యాలుగా ఇక్కడ శిక్షణ మొదలైంది. నియమబద్ధమైన తరగతుల నిర్వహణ, ప్రయోగాత్మక శిక్షణ ద్వారా పనితీరులో సర్వతోముఖ పురోగతి సాధనకు అనువైన ఉత్తమ శిక్షణా ప్రణాళికను తీర్చిదిద్దారు. సెక్షన్ ఆఫీసర్లకు ఏడాది, బీట్ ఆఫీసర్లకు ఆరు మాసాల వ్యవధిలో శిక్షణ ఇవ్వడం జరుగుతున్నది. ఎపి అటవీ అభివృద్ధి సంస్థ, పట్టణాభివృద్ధి సంస్థ, ఎస్‌సి కార్పొరేషన్, ఎన్‌జిఓలు (స్వచ్ఛంద సంస్థలు), ఇంకా ప్రయివేటు సంస్థలు స్పాన్సర్ చేసే వారికి కూడా ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వారి అనుమతి మేరకు, అలాగే సీట్ల లభ్యతను బట్టి శిక్షణ ఇచ్చే వెసులుబాటు ఉంది. అయితే దీనికి ఆయా సంస్థలు రుసుమును ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది. ఇంతవరకూ రెండు బ్యాచ్‌ల బీట్ ఆఫీసర్ల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన ఈ అకాడమీ గతనెల 30న మొదటి బ్యాచ్ సెక్షన్ ఆఫీసర్ల శిక్షణ కూడా దిగ్విజయంగా పూర్తిచేసి ఘనంగా స్నాతకోత్సవాన్ని నిర్వహించింది.

అడవికి అభయం ... గిరిజన ఉపాధికి భరోసా

వనసంరక్షణ సమితులతో ఉభయ కుశలోపరి

అడవుల పరిరక్షణ, అటవీ ప్రాంత ఆదాయం పెంపు, గిరిజనాభ్యుదయం అనే మూడు లక్ష్యాల సాధనకు ఏర్పాటైనవే వనసంరక్షణ సమితులు. అడవులను విచక్షణా రహితంగా నరికివేయడంతో ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితి దిగజారుతున్నదని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్నదని గ్రహించిన ప్రభుత్వం అడవుల రక్షణకు, విస్తీర్ణం పెంపుసకకు అటవీ ప్రాంతాల పరిసరాల్లోని గ్రామాల ప్రజల సహకారం తీసుకోవాలని నిశ్చయించింది. అలా ఏర్పాటైనవే వన సంరక్షణ సమితులు. 1992లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ సమితులు ఏర్పడ్డాయి. ఇవి వచ్చిన తర్వాత అనేక వేల హెక్టార్లలో అటవీ విస్తీర్ణం పెరిగింది. ఉమ్మడి అటవీ యాజ మాన్యం కింద వనసంరక్షణ సమితులు ద్వారా అటవీ అభివృద్ధి కార్యక్రమాలు నడుస్తున్నాయి. వన్యప్రాణుల వధ, తరలింపు వంటి నేరాలకు సంబంధించిన సమాచారం అందిస్తే విఎస్ఎస్ సభ్యులకు రివార్డులు కూడా ఇస్తారు. జీవావరణ, పర్యావరణ పరిరక్షణకు ఈ సమితుల సహకారాన్ని ప్రభుత్వం తీసుకుంటుంది. 'వన సంరక్షణే మన సంరక్షణ' అనే భావన గ్రామస్తులు, గిరిజనంలో పెరగడంతో అడవుల పెంపకానికి ప్రాధాన్యం పెరిగింది. 1992లో ఉమ్మడి అటవీ యాజమాన్య పథకం ద్వారా రాష్ట్రంలో 13 లక్షల మందితో 7,245 వన సంరక్షణ సమితులు ఏర్పడ్డాయి. అటవీ ప్రాంతా ల సంరక్షణ బాధ్యత నిర్వర్తించడంతో పాటు ఆదాయంలో వాటా పొందే వన సంరక్షణ సమితుల కారణంగా గిరిజ నుల జీవితాలకు ఆర్థిక భద్రత చేకూ రింది. మార్కెటింగ్, ప్రచార పరంగా కూడా అటవీశాఖ గిరిజనులకు చేదోడు వాదోడుగా ఉంటూ వారి ఆర్జన పెంచేం దుకు దోహదపడుతోంది. వనం ఉంటేనే తమ ఉనికి, వృద్ధి అనే విషయాన్ని గిరిజనులు, శివారు గ్రామాల ప్రజలు గుర్తించేలా చేయడంలోనే ఉమ్మడి అటవీ యాజమాన్యం యొక్క విజయం ఇమిడి ఉంది. అందుకే ప్రజాభాగస్వామ్యానికి వారిని చైతన్యపర్చడమే సరైన మార్గం.

కొత్త లోకాన్ని ఆవిష్కరించే

కోరంగి అభయారణ్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతిపెద్ద మడ అడవుల స్థావరం కోరంగి అభయారణ్యం. మడ అడవుల విస్తీర్ణం పరంగా దేశంలోనే ఇది రెండవస్థానం ఆక్రమించింది. విలక్షణ జీవ వైవిధ్యం, ప్రత్యేక వాతావరణ పరిస్థితులతో అలరారే కోరంగి అభయారణ్యం ఎకో టూరిజంలో రాష్ట్ర స్థాయి ప్రాముఖ్యతని సంతరించుకుంది. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ కు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోరంగి వద్ద ఈ అభయారణ్యం ఉంది ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద మడ అడవులు కలిగిన ప్రాంతంగా కోరంగి ప్రసిద్ధిచెందింది. సుమారు 23,500 హెక్టార్ల విస్తీర్ణం కలిగివున్న ఈ అభయారణ్యం అరుదైన జంతుజాలం, విదేశీ, స్వదేశీ పక్షులకు నిలయం. ఔషధ గుణాలు కలిగిన అనేక అరుదైన వృక్షజాతులకు ఈ మడ అడవులు అలవాలమని చెప్పవచ్చు. గత ఐదారేళ్లుగా ఈ అభయారణ్యంలో పర్యాటక సదుపాయాలను విస్తరిస్తున్న నేపథ్యంలో సందర్శకుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. కోరంగి అభయారణ్యంలో విహారానికి వీలుగా ఇటీవలే బోటు సదుపాయం కల్పించారు. మర బోట్లలో ప్రయాణిస్తూ మహారణ్యాన్ని వీక్షించే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఈ అభయారణ్యంలో పర్యాటకుల కోసం రూపొందించిన ఉడెన్ వంతెన ఒక ప్రత్యేక ఆకర్షణ. మడ అడవుల నుండి మహా సముద్రం వరకు బోటు షికారు చేయవచ్చు. కాకినాడ-యానాం ప్రధాన రహదారిలోని కోరంగి గ్రామం నుండి నేరుగా అభయారణ్యానికి చేరుకోవచ్చు. అయితే ఈ దారి బాగుండకపోవడంతో పర్యాటకులు ఇబ్బంది పడేవారు. ఈ రోడ్డు నిర్మాణానికి మన ప్రభుత్వం రూ. 2 కోట్లు మంజూరు చేసింది. కోరంగి అభయారణ్యం అభివృద్ధికి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని ఇటీవల కోరంగి అభయారణ్యంలో పర్యటించిన రాష్ట్ర అటవీ శాఖ మంత్రివర్యులు శిద్దా రాఘవరావు అధికారులను ఆదేశించారు. ఈ అభయారణ్యాన్ని జాతీయ స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని మంత్రివర్యులు సూచించారు. సముద్ర తీర జీవావరణ వ్యవస్థలో కోరంగి అభయారణ్యానికి ఉన్న ప్రాధాన్యత ఎనలేనిది. దేశంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సుందర్‌బన్ అభయారణ్యం తర్వాత మళ్ళీ అంత విశిష్టత కలిగిన అరణ్యం ఇదేనని అంటారు. దీనిని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిస్తే మడ అడవుల ద్వారా తీరానికి రక్షణ మాత్రమే కాకుండా పర్యావరణ, జీవావరణ రక్షణ సాధ్యపడు తుందని... అలాగే పర్యాటక ప్రాంతంగా కూడా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. వర్షాకాలం వెళ్ళిన తరువాత అక్టోబరు నుంచి మే వరకు కోరింగ అభయారణ్యాన్ని సందర్శించడానికి అనువైన సమయం. నవంబరు నుంచి ఫిబ్రవరి వరకు వలస పక్షులను ఇక్కడ చూడవచ్చు. జనవరి నుంచి మార్చి నెలల వరకు సముద్రపు తాబేళ్ళు, సముద్ర తీరాన గుడ్లు పెట్టడానికై వస్తాయి. సంవత్సరంలో 12 నెలలూ ఈ అభయారణ్యంలో ఏదో ఒక ఆకర్షణ ఉంటుంది. అయితే వాతావరణ రీత్యా నవంబరు, డిసెంబర్ నెలలు అత్యుత్తమ మైనవి. జీవవైవిధ్యాన్ని ప్రత్యక్షంగా చూ పడానికి, విజ్ఞా నాన్నీ, వినోదాన్నీ ఒకే చోట పొంద డానికి కోరంగి అభ యారణ్య సందర్శన ఎంత గానో ఉపయోగపడుతుంది.



ఆహ్లాదానికి ఆలవాలం

రంగురంగుల పడవలు, చిత్తడినేలలు, వాటిలో పెరిగే పొట్టి చెట్లతో కూడిన మడ అడవుల సమూహాలు, సముద్రపు గాలీ ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. 1998లో కోరంగి అభయారణ్యంగా ప్రకటించారు. ఒకపక్క హోప్ ఐలాండ్ మరోపక్క మడ అభయారణ్యం ఇక్కడి తీరప్రాంతానికి రక్షణ కవచంలా తుపానుల ప్రభావాన్ని తగ్గిస్తున్నాయనే చెప్పాలి. అభయారణ్యంతోపాటు సముద్రంలో కలిసే నదీ సంగమం చూసేందుకు పర్యాటకులకు రెండు కళ్ళూ సరిపోవు. నీటికుక్క, అడవి పిల్లి, బంగారునక్క ఈ ప్రాంత జీవాలు. ఇక్కడ అరుదైన జంతుజాలాలతో ప్రత్యేక ప్రదర్శనశాల ఏర్పాటు చేసింది. 575 రకాల చేపలను, 35 రకాలు చెట్లను ఇక్కడ గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ అభయారణ్యం ఏటా సుమారు 90 వేల పక్షులకు ఆతిధ్యం ఇస్తోంది. ఆ పక్షులకు ఆహార సేకరణతోపాటు సంతానోత్పత్తి కేంద్రంగా ఈ ప్రాంతం పేర్గాంచింది.

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీ సంచాలకులు మరియు
ముఖ్య అటవీ సంరక్షణాధికారి, రాజమహేంద్రవరం సంయుక్త ఆధ్వర్యంలో...